
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తమిళనాడు
TAMILNADU
సోమవారం 19 మే 2025


ఓటేస్తున్న ఆస్కా అధ్యక్షుడు కె.సుబ్బారెడ్డి


ఆస్కా మాజీ అధ్యక్షుడు నరసారెడ్డి


ఆస్కా మాజీ అధ్యక్షుడు మాదాల ఆదిశేషయ్య


ఆస్కా ప్రాంగణం ముందు సందడి


మెంబర్స్ వాయిస్ తరుపున అధ్యక్ష పదవికి పోటీచేస్తున్న శశిధర్ రెడ్డి


ట్రెండ్ సెట్టర్స్ తరుపున అధ్యక్ష పదవికి పోటీచేస్తున్న ప్రతాప్ రెడ్డి


లలితా జ్యువెలరీ సంస్థల అధినేత కిరణ్‌కుమార్

ఉత్సాహభరితంగా ఆస్కా ఎన్నికలు

● ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ప్యారీస్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో 1952లో స్థాపించిన ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా)కు ఆదివారం జరిగిన ఎన్నికలో సభ్యులు ఉత్సాహంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ నగరంలో ఓ వెలుగు వెలిగినప్పుడు సినీ ప్రముఖులకు ఈ సంస్థ ప్రధాన కేంద్రంగా ఉండేది. తమిళనాడు సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్ -1975 ప్రకారం రిజిస్టర్ చేసిన ఈ క్లబ్‌లో సభ్యులుగా ఉండాలనుకునేవారు బైలా ప్రకారం నమోదు చేసుకోవాలి. ఆస్కాలో సుమారు 2600 మంది సభ్యులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. 2025-27 వరకు రెండేళ్లపాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకుగాను ఆదివారం ఎన్నికలు నిర్వహించారు.



మెంబర్స్ వాయిస్ ప్యానెల్ నుంచి జి. శశిధర్‌రెడ్డి, ట్రెండ్ సెట్టర్స్ ప్యానెల్ నుంచి ఎం. ప్రతాప్‌రెడ్డితో అధ్యక్షత పదవికి పోటీ చేయగా, వారితో పాటు ఆఫీస్ బేరర్లు, కమిటీ సభ్యులు, ట్రస్టీ పదవులకు 23 మంది పోటీపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 8.30 గంటలవరకు కొనసాగింది. ఇందులో రాజకీయ, చలనచిత్ర, వాణిజ్య రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు, వివిధ తెలుగు సంఘాల నిర్వాహకులు విచ్చేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

← ఓటర్ జాబితాలో పేర్లు చూస్తున్న ఆస్కా సభ్యులు

7న తిరుచెందూరు ఆలయ కుంభాభిషేకం


ముహూర్తపు రాట కార్యక్రమంలో మంత్రి అనితా ఆర్ రాధాకృష్ణన్, జిల్లా కలెక్టర్ ఇలంభగవత్ తదితరులు

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయ మహాకుంభాభిషేకం జూలై 7న నిర్వహించనుండటంతో దీనికి సంబంధించి స్తంభ స్థాపన కార్యక్రమం, భూమిపూజ ఆదివారం నిర్వహించారు. రాష్ట్రమంత్రి అనితా ఆర్ రాధాకృష్ణన్, జిల్లా కలెక్టర్ కే ఇలంభగవత్, తక్కర్ ఆర్.అరుళ్‌మురుగన్ తదితరులు పాల్గొన్నారు. గత రెండేళ్లగా కొనసాగుతున్న ఆలయ జీర్ణోద్ధరణ పనులు ఈ నెలాఖరుతో ముగియనున్నాయి. ఆలయ అంతర ప్రాకారంలో, స్వామి షణ్ముఖ ఆలయ గిరి ప్రాకారం వద్ద రాజగోపురం ఉన్నత ద్వారం సమీపంలోనూ యాగశాలలు ఏర్పాటు చేయనున్నారు. తొలివిడతగా ఆదివారం ఉదయం షణ్ముఖస్వామివారికి యాగశాలల నిర్వహించేందుకుగాను భూమిపూజ జరిగింది. రాజగోపురం ద్వారం వద్ద యాగశాలను ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో వినాయకపూజ, పుణ్యావహచనం, భూమి పూజ తర్వాత మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ మంత్రి అనితా ఆర్ రాధాకృష్ణన్ శుభముహూర్త స్తంభాన్ని నాటారు. తొలుత దేవాదాయ శాఖ ఆగమ నిపుణుల సంఘానికి చెందిన పిళ్ళయార్‌పట్టి పిచ్చై గురుక్కల్ నేతృత్వంలో తూత్తుకుడి జిల్లా ఆగమ నిపుణుల సంఘానికి చెందిన భట్టర్, తిరుచెందూరు శివాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలలో తిరుచెందూరు తహసీల్దార్ సుకుమారన్, మున్సిపల్ అధ్యక్షురాలు శివ ఆనంది, ఉపాధ్యక్షులు సెంగుళి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టాస్మాక్ అవినీతి వ్యవహారం

ముగిసిన ఈడీ తనిఖీలు


టాస్మాక్ ఎండీ విశాఖన్‌ను ఈడీ కార్యాలయానికి తీసుకెళ్తున్న అధికారులు

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ సంస్థలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు గత రెండు రోజులపాటు ఆ సంస్థ ఎండీ విశాఖన్ నివాసం సహా ఎనిమిదిచోట్ల జరిగిన దాడులు శనివారం రాత్రి ముగిశాయి. శుక్రవారం ఉదయం నుండి శనివారం రాత్రి వరకూ జరిగిన ఈ సోదాలలో కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నగరంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త రతీష్ నివాసంలో జరిగిన దాడుల్లోనూ కీలకమైన ఆధారాలు సేకరించినట్లు చెబుతున్నారు. ఆ దాడులు జరిపినప్పుడు రతీష్ ఇంటిలో లేదు. దీనితో ఆయన నివాసానికి ఈడీ అధికారులు తాళం వేశారు. శనివారం తక్కిన ఏడు చోట్ల మాత్రమే ఈడీ తనిఖీలు కొనసాగాయి. టాస్మాక్ మేనేజింగ్ డైరెక్టర్ విశాఖన్‌ను రెండోసారి కూడా నుంగంబాక్కంలో తమ కార్యాలయానికి తీసుకెళ్లి ఈడీ అధికారులు విచారణ జరిపారు. మనపాక్కంలోని విశాఖన్ నివాసంలో శనివారం అర్ధరాత్రి వరకూ తనిఖీలుకు కొనసాగించారు. ఇక తేనాంపేటలోని సినీ నిర్మాత ఆకాష్ భాస్కరన్ నివాసంలోనూ రెండు రోజులపాటు జరిపిన తనిఖీలు శనివారం రాత్రి 9 గంటలకు ముగిశాయి. మార్చిలో టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన తనిఖీల సందర్భంగా ఆ సంస్థలోని నలుగురు అధికారుల వద్ద మాత్రమే ఈడీ అధికారులు విచారణ జరిపి సంస్థ ఎండీ విశాఖన్‌కు సంబంధించిన కీలకమైన వివరాలను రాబట్టారని తెలుస్తోంది. ఆ ఉద్యోగులు అందించిన సమాచారం ప్రకారమే ఈడీ అధికారులు విశాఖన్ నివాసంలో రెండు రోజులపాటు తనిఖీలు జరపటం, ఆ రెండు రోజులూ సాయంత్రం వేళల్లో తమ ఆఫీసుకు తీసుకెళ్ళి ప్రశ్నించడం జరిగాయి. మొత్తానికి ఈ దాడులలో విశాఖన్ నివాసంలో కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

దుబాయ్‌కి పరారైన రతీష్ ?

ఇదిలా ఉండగా ఈడీ అధికారుల దాడులను ముందుగా పసిగట్టి పట్టినంబాక్కంలో నివసిస్తున్న పారిశ్రామికవేత్త రతీష్ దుబాయ్‌కి పారిపోయినట్లు సమాచారం అందటంతో ఈడీ అధికారులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం పట్టినంబాక్కంలోని రతీష్‌కు చెందిన బంగళాలో ఈడీ అధికారులు తనిఖీలకు వెళ్ళినప్పుడు ఆయన లేరు. ఆ బంగళాలో ఉన్న కుటుంబ సభ్యులు, సిబ్బంది సమక్షంలో అధికారులు సోదాలు జరిపారు. ఆ తర్వాత బంగాళాలో ఉన్నవారిని బయటకు పంపి తాళం వేశారు. శనివారం మళ్ళీ రతీష్ నివాసానికి వెళ్ళినప్పుడు ఆయన నగరంలోనే లేదనే సమాచారం తెలుసుకున్నారు. ఈ పరిస్థితులలోనే రతీష్ దుబాయ్‌కి పారిపోయినట్లు చెబుతుండటంతో ఆయన ఆచూకీని కోసం ఈడీ అధికారులు చర్యలు చేపట్టారు.

డెన్మార్క్ పరిజ్ఞానంతో సముద్రంలో విండ్‌మిల్స్

● కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం



టి.నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సముద్రతీర జిల్లాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా బంగాళాఖాతంలో విండ్‌మిల్లుల పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. డెన్మార్క్ సంస్థ సహకారంతో ఈ పథకాన్ని దేశంలోనే తొలిసారిగా అమలు చేయడానికి చర్యలు కూడా చేపడుతోంది. ఈ పథకంపై ఉన్నతాధికారుల స్థాయి సమావేశం నగరంలో జరిగింది. సంపన్న దేశాల్లో ప్రస్తుతం సముద్ర గర్భంలో విండ్‌మిల్లులను ఏర్పాటు చేసి భారీ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ పథకం వల్ల పలు దేశాలు విద్యుత్ ఉత్పత్తి మిగులు దేశాలుగా పేరొందాయి. ఆ రీతిలోనే రాష్ట్రంలోనూ సముద్రగర్భంలో విండ్ మిల్లులు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయాలని అధికారుల సమావేశంలో నిర్ణయించారు. దేశంలో బంగాళాఖాతం మాత్రమే విండ్‌మిల్లులు ఏర్పాటు చేయడానికి అనువుగా ఉన్నాయని ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణులు సైతం ప్రకటించారు. ఇప్పటికే బంగాళాఖాతంలో విండ్‌మిల్లుల ఏర్పాటుకు అనువైన ప్రాంతాన్ని కూడా ప్రభుత్వం గుర్తించింది. ఈ పథకానికి సంబంధించి త్వరలోనే ప్రభుత్వం ఓ అధికారిక ప్రకటన చేయనుందని అధికారులు తెలిపారు. దేశంలో సముద్రంలో విండ్ మిల్లులు నెలకొల్పే సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో డెన్మార్క్‌లోని డేనిష్ ఎనర్జీ ఏజెన్సీ సంస్థ సహకారంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఆ మేరకు చెన్నై అన్నాసాలైలోని రాష్ట్ర విద్యుత్ బోర్డు ప్రధాన కార్యాలయంలో డెన్మార్క్ డేనిష్ ఎనర్జీ సంస్థ, డెన్మార్క్ ఎంబసీ, రాష్ట్ర గ్రీన్ ఎనర్జీ బోర్డు అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విద్యుత్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ జే రాధాకృష్ణన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో డెన్మార్క్ ఇంధన సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సైడెన్ లెత్ రసముచస్, రాష్ట్ర గ్రీన్ ఎనర్జీ బోర్డు డైరెక్టర్ అనీష్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బంగాళాఖాతంలో విండ్‌మిల్లులను ఏర్పాటు చేసి భారీ పైప్‌లైన్‌ల ద్వారా విద్యుత్‌ను భూభాగానికి చేర్చేందుకు అవసరమైన పరికరాలను గురించి సమగ్రంగా చర్చలు జరిపారు.

తిరువణ్ణామలై ఎంపీకి

'సంసద్ రత్న' అవార్డు


ఎంపీ సీఎన్ అన్నాదురై

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో తన నియోజకవర్గం ప్రజల సమస్యలను, జాతీయ స్థాయి సమస్యలను సభదృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేసి, పటిష్టమైన చర్యలలో పాల్గొనందుకుగాను తిరువణ్ణామలై ఎంపీ సీఎన్ అన్నాదురైకి సంసద్ రత్న జాతీయ అవార్డు ప్రకటించారు. ప్రతియేటా పార్లమెంట్‌లో ప్రజల సమస్యల పరిష్కారం దిశగా సమర్థవంతంమైన వాదనలతో ప్రతిభ కనబరిచినందుకు కేంద్రం ప్రభుత్వం ఈ అవార్డులను ప్రకటిస్తుంది.. ఆ మేరకు ఈ యేడాది వ్యక్తిగత విభాగంలో 17 మంది ఎంపీలను, ప్రత్యేక విభాగంలో నలుగురు ఎంపీలను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. వీరిలో తిరువణ్ణామలై ఎంపీ సీఎన్ అన్నాదురై కూడా ఉన్నారు. 11 యేళ్ల తర్వాత రాష్ట్రానికి చెందిన ఎంపీకి మళ్ళీ ఈ అవార్డు లభించడం విశేషం. ఢిల్లీలో జూలైలో జరుగనున్న ప్రత్యేక వేడుకల్లో సంసద్ రత్న అవార్డులను ప్రదానం చేయనున్నారు.

వన్నియర్ సంఘ నాయకులు ఎటువైపు?


రాందాస్, డాక్టర్ అన్బుమణి

అడయార్, మే 18 (ఆంధ్రజ్యోతి): పీఎంకే అధినేతలైన తండ్రీకొడుకుల మధ్య ఏర్పడిన ఆధిపత్యపోరు కారణంగా ఆ పార్టీకి అండగా ఉన్న వన్నియర్లు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వన్నియర్ సంఘ నిర్వాహకుల సమావేశం దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో జరుగనుంది. ఇందులో వన్నియర్ సంఘ నాయకులు ఎటువైపు అన్నది తేలనుంది. పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. ఈ తండ్రీ కుమారుల మధ్య ఏర్పడిన మనస్పర్థలు పార్టీ నేతల్లో అయోమయానికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే పార్టీ నేతలందరినీ తనదారిని తెచ్చుకున్న అన్బుమణి వన్నియర్ సంఘ నిర్వాహకులను కూడా తనవైపునకు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. దీంతో సోమవారం జరిగే వన్నియర్ సంఘ సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. శనివారం రాందాస్ అధ్యక్షతన తైలాపురంలో మహిళా విభాగం, విద్యార్థి విభాగం, యువజన విభాగ సమావేశాలకు అతికొద్దిమంది మాత్రమే పాల్గొన్నారు. అన్బుమణి వంటి ప్రధాన నేతలు ఈ సమావేశాలకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తైలాపురంలో జరిగే వన్నియర్ సంఘ నిర్వాహకుల సమావేశానికి అమిత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో వన్నియర్ సంఘానికి చెందిన జిల్లా కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొనున్నారు. పైగా ఈ కీలక సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని వన్నియర్ సంఘ అధ్యక్షుడు అరుళ్‌మొళి పిలుపునిచ్చారు.. వన్నియర్ సంఘంలో మొత్తం 91 జిల్లా విభాగాలున్నాయి. ఈ విభాగాలకు చెందిన అధ్యక్షుడు, కార్యదర్శులు మాత్రమే పాల్గొనాలని ఆయన కోరారు. కాగా, ఈ సమావేశంలో తమ సంఘం భవిష్యత్ కార్యాచరణతో పాటు పీఎంకేలో ఉత్పన్నమైన ప్రస్తుత సంక్షోభంపై చర్చించే అవకాశం ఉంది.

బాణసంచా గోదాములో పేలుడు

● ఇద్దరు కార్మికుల దుర్మరణం



ఘటనా స్థలంలో రసాయనాలను సేకరిస్తున్న ఫోరెన్సిక్ నిపుణులు - గోదాము ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పట్టుకోట సమీపం తిరువోణం వద్ద లైసెన్స్‌లేకుండా టపాసులు నిల్వ చేసే గోదాములో ఆదివారం ఉదయం సంభవించిన పేలుడులో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ గోదాములో ప్రతిరోజూ పదిమంది కార్మికులు పనిచేస్తుంటారు. ఆదివారం ఉదయం కూడా కొంతమంది కార్మికులు టపాసులు సర్దడానికి వెళ్ళారు. ఆ సమయంలో ఉన్నట్టుండి టపాసుల మధ్యలో రాపిడి ఎక్కువై ఉన్నట్టుండి పేలుడు సంభవించి గోదాము పూర్తిగా నేలమట్టమైంది. ఈ దుర్ఘటనలో నైవేలి తెన్‌పాది ప్రాంతానికి చెందిన సుందరరాసు(60), రియాజ్ (18) అనే ఇద్దరు కార్మికులపై గోదాము శిథిలాలు పడి దుర్మరణం చెందారు. వట్టత్తికోట పోలీసులు, ఒరత్తనాడు డీఎస్పీ కార్తికేయన్, తిరువోణం తహసీల్దార్ సుందరమూర్తి ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. అగ్నిమాపక అధికారి సత్యమూర్తి నాయకత్వంలో సిబ్బంది ప్రమాదస్థలంలో శిథిలాలు తొలగించి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టంకు తరలించారు.

సమాచార దర్శిని

కరోనాపై భయాందోళనలు వద్దు

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా వ్యాప్తిపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ఆ మేరకు ఆరోగ్య శాఖ విడుదల చేసిన ప్రకటనలో.. సింగపూర్, థాయ్‌లాండ్ దేశాల్లో కరోనా మళ్లీ వ్యాపిస్తోందని తెలిపింది. రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నియంత్రణలో ఉందని, వీర్యం లేని కరోనా కావడంతో ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆరోగ్య శాఖ తెలిపింది.

కోవైలో రూ.327 కోట్లతో కేంద్ర కారాగారం

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో 97 ఎకరాల్లో రూ.327 కోట్లతో కేంద్ర కారాగారం నిర్మించనున్నారు. కారమడై, బిళీచీ ప్రాంతాల్లో జైలు ప్రాంగణం ఏర్పాటు చేసేందుకు పర్యావరణ అనుమతులు కోరుతూ జైళ్ల శాఖ దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో, జైలు ప్రాంగణం నిర్మాణ పనులకు రాష్ట్ర పర్యావరణ శాఖ అంచనా కమిషన్ అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడేవారెందరు...?

● సర్వే చేయనున్న కమిషన్

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఆటలకు సంబంధించిన విధివిధానాలు ఎందరికి తెలుసు? ఎంత మంది ఆన్‌లైన్ ఆటల్లో పాల్గొంటున్నారు? అనే విషయాలపై రాష్ట్ర ఆన్‌లైన్ ఆటల కమిషన్ సర్వే చేపట్టనుంది. రాష్ట్రంలో 18 ఏళ్ల కంటే తక్కువ ఉన్న బాలబాలికలు నగదు వెచ్చించి ఆన్‌లైన్ గేమ్స్ ఆడడంపై నిషేధం అమలులో ఉంది. అలాగే, ఆన్‌లైన్ గేమ్స్ సంస్థలు, తమ వినియోగదారుల వయస్సు గుర్తించేలా సర్టిఫికెట్లు పొందాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో, ఆన్‌లైన్ క్రీడలపై ఉన్న నిబంధనలు ఎంతమందికి తెలుసు, ఈ క్రీడల్లో పాల్గొనేవారు ఎందరు అనే విషయాలపై కమిషన్ సర్వే చేపట్టనుందని అధికారులు తెలిపారు.

రోడ్డు మార్గాల్లో భద్రత లేని ప్రదేశాల వివరాలు

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు మార్గాల పక్కన ఉన్న బావులు, పల్లపు ప్రాంతాలు సహా భద్రత లేని ప్రదేశాలు పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. తూత్తుకుడి జిల్లా సాతాన్‌కుళం సమీపంలో శనివారం రోడ్డు పక్కనున్న బావిలో ఆమ్నీ వ్యాన్ పడిన ఘటనలో ఐదుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, రోడ్డు పక్కన భద్రత లేకుండా ఉన్న ప్రదేశాలను అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

రిజర్వుడు బోగీల్లో ప్రయాణిస్తే జరిమానా

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): సాధారణ టిక్కెట్టుతో రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణించే వారికి సత్వర జరిమానా విధించనున్నారు. ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లలో సాధారణ బోగీల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో, జనరల్ బోగీలు ఎప్పుడూ కిటకిటలాడుతుంటాయి. దీంతో, కొందరు ప్రయాణికులు రిజర్వేషన్ బోగీలకు వెళ్తుండడంతో, అప్పటికే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో, సాధారణ టిక్కెట్టుతో రిజర్వేషన్ బోగీలో ప్రయాణించే వారిని అడ్డుకొనేలా దక్షిణ రైల్వే ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసింది. ఇద్దరు రైల్వే పోలీసులు, ఒక టీసీతో కూడిన బృందాలు రిజర్వేషన్ బోగీలను పరిశీలించి, సాధారణ టిక్కెట్టుతో ప్రయాణించే వారికి సత్వరం జరిమానా విధించడంతో పాటు వారిని సాధారణ బోగీల్లోకి పంపే చర్యలు చేపడతారని దక్షిణ రైల్వే తెలిపింది.

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు వేసవి ప్రత్యేక శిబిరాలు ఈ నెల చివరి వారంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ కన్నప్పన్ జిల్లా ప్రధాన విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో.. నీలగిరి, సేలం (ఏర్కాడు) తదితర జిల్లాల్లో రెండు విభాగాలుగా ఐదు రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్ వన్ పూర్తిచేసి, సాహిత్యం, ఆటలు, సైన్స్, క్విజ్ తదితరాల్లో రాణించిన 1,500 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులు తల్లిదండ్రుల అనుమతి పత్రంతో పాటు దుస్తులు, గుర్తింపు కార్డు, అవసరమైన వస్తువులు తీసుకురావాలి. విద్యార్థినులను తీసుకొచ్చే సమయంలో 20 మంది విద్యార్థులకు ఒక మహిళా ఉపాధ్యాయురాలు తప్పక ఉండాలి. శిక్షణా శిబిరం నిర్వహించే తేదీలు, శిక్షణకు సంబంధించిన అంశాలపై త్వరలో ప్రకటన విడుదల చేయనున్నట్లు సర్క్యులర్‌లో తెలిపారు.

కుంభకరై జలపాతంలో స్నానాలకు అనుమతి

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా కుంభకరై జలపాతంలో పర్యాటకుల స్నానాలకు అటవీ శాఖ అనుమతించింది. పశ్చిమ కనుమల ప్రాంతంలోని కుంభకరై జలపాతానికి రాష్ట్రంలో పాటు కేరళ, కర్ణాటక సహా పలు రాష్ట్రాల పర్యాటకులు వస్తుంటారు. ఈ క్రమంలో, కొండ ప్రాంతాల్లో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జలపాతం వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉంది. అలాగే, జలపాతం వద్ద ప్రయాణికుల భద్రత దృష్ట్యా పలు ఏర్పాట్లు చేపడుతున్న కారణంగా, జలపాతంలో పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించారు. పనులు పూర్తికావడంతో, జలపాతం వద్ద నీటి ప్రవాహం తగ్గడంతో ఆదివారం నుంచి పర్యాటకులు స్నానం చేసేందుకు అటవీ శాఖ అనుమతించింది.

వర్షానికి కొట్టుకుపోయిన చేపలు

వేలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పేర్నాబట్టు సమీపంలోవున్న చెరువులోని చేపలు వర్షానికి కొట్టుకుపోయాయి. కొత్తపల్లికి చెందిన ప్రకాశం అనే వ్యక్తి ఆ గ్రామంలో చేపల చెరువును నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, గత కొన్ని రోజులుగా ఆ ప్రాంతంలో కురుస్తున్న వర్షానికి కొత్తపల్లి సహా మరో మూడు ఊళ్లు జలమయమయ్యాయి. దీంతో శనివారం రాత్రి కురిసిన వర్షానికి పక్కనే వున్న నదిలో నీటి ప్రవాహానికి చెరువులోని సుమారు 15వేల చేపలు కొట్టుపోయాయి. ప్రభుత్వం తనకు నష్టపరిహారాన్ని అందజేయాలని కోరుతున్నాడు.

తొలగించిన విద్యుత్ కనెక్షన్: కోళ్లు మృతి



పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించలేదని విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో 14వేల కోళ్లు మృతిచెందిన ఘటన విరుదునగర్ జిల్లాలో చోటుచేసుకుంది. చొక్కలింగపురానికి చెందిన చెల్లముత్తుపాండియన్ మూడేళ్లుగా కోళ్ల ఫారం నడుపుతున్నాడు. అతడికి రూ.26,765 విద్యుత్ బిల్లుల బకాయి ఉంది. అలాగే, గత నెల విద్యుత్ బిల్లులు రూ.22,233 చెల్లింపునకు ఈ నెల 20వ తేది వరకు గడువు ఉంది. శుక్రవారం గత నెల బిల్లు చెల్లించేందుకు వెళ్లి చెల్లముత్తుపాండియన్‌ను బకాయి కూడా చెల్లించాలని కార్యాలయ ఉద్యోగులు చెప్పడంతో, బకాయి, గత నెల బిల్లు మొత్తం రూ.49,719 చెల్లించాడు. కానీ, అప్పటికే విద్యుత్ ఉద్యోగులు కోళ్ల ఫారం విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో, ఏసీ పనిచేయక 14వేల కోళ్లు మత్యువాతపడ్డాయి. ఈ వ్యవహారంపై చెల్లముత్తుపాండియన్ విద్యుత్ బోర్డు అధికారులపై మారనేరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విద్యుత్ బోర్డు నిర్వహణ ఇంజనీర్ ముత్తురాజ్ మాట్లాడుతూ... బకాయిలు చెల్లించాలని ఆరు నెలల క్రితమే చెల్లముత్తుపాండ్యన్‌కు నోటీసులిచ్చామన్నారు. శుక్రవారం విద్యుత్ కనెక్షన్ తొలగించిన తర్వాతే అతను నగదు చెల్లించారని, చెల్లించిన అరగంటకే విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించామని తెలిపారు.

అంధకారంలో ప్రభుత్వాస్పత్రి
సెల్‌ఫోన్ వెలుగుల్లో సిబ్బంది విధులు

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో హఠాత్తుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగడంతో సెల్‌ఫోన్ వెలుగుల్లో వైద్యులు చికిత్స అందించారు. నామక్కల్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో శనివారం అర్ధరాత్రి హఠాత్తుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అదే సమయంలో ఆస్పత్రిలో ఉన్న జనరేటర్ కూడా పనిచేయకపోవడంతో, ఐసీయూ, ప్రసవ వార్డు తదితర గదుల్లో ఉన్న రోగులు ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో, రోగులకు సెల్‌ఫోన్ వెలుగుల్లో వైద్యులు చికిత్స అందించగా, సిబ్బంది కూడా సెల్‌ఫోన్ వెలుగుల్లో పనులు చేశారు. అరగంట తర్వాత విద్యుత్ పునరుద్ధరించారు. ఈ విషయమై కళాశాల డీన్ శాంత అరుళ్‌మొళి మాట్లాడుతూ... వైద్యకళాశాల ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా ఆగిపోతే ఆటోమేటిక్‌గా జనరేటర్ ఆన్ అవుతుందన్నారు. కానీ, శనివారం రాత్రి జనరేటర్ మరమ్మతులకు గురికావడంతో ఇబ్బంది వచ్చిందన్నారు. ఎలక్ట్రీషియన్ మర్మమతులు చేపట్టిన అనంతరం జనరేటర్ సహాయంతో విద్యుత్ సరఫరా జరిగిందని డీన్ తెలిపారు.



సెల్‌ఫోన్ వెలుగుల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది

యువతి మెడలో బంగారు గొలుసు చోరీ

వేలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడిచివెళ్తున్న ఓ యువతి మెడలో గొలుసు చోరీకి గురైంది. వేలూరు జిల్లా పేర్నాబట్టు సమీపంలోని పుత్తూరు గ్రామంలో జరిగిన ఈ చోరీకి సంబంధించి వివరాలిలా... ఆదివారం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన ఓ యువతిపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేసి ఆమె మెడలోని బంగారు గొలుసును దొంగిలించాడు. దీంతో ఆ యువతి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో దొంగ పరారయ్యాడు. గాయాలతో పడివున్న ఆ యువతిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

వాల్పారై వద్ద బస్సు బోల్తా: 40 మందికి గాయాలు

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారై వద్ద 20 అడుగుల లోతున్న గోతిలో రవాణా సంస్థ బస్సు బోల్తాపడి 40 మంది ప్రయాణికులు గాయపడ్డారు. తిరుప్పూరు నుండి ఆదివారం వేకువజాము 12.30 గంటలకు రాష్ట్ర రవాణా సంస్థ బస్సు వాల్పారైకి బయలుదేరింది. 72 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఆ బస్సు వాల్పారై సమీపం ఘాట్‌రోడ్డులో 33వ మలుపు వద్ద అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న 20 అడుగుల గోతిలో బోల్తాపడింది. బస్సులోని ప్రయాణికులు పెట్టిన కేకలు విన్న స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక దళం సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్లి బస్సు శిథిలాల మధ్య చిక్కుకుని తీవ్రగాయాలతో ఉన్న ప్రయాణికులకు బయటకు తీసి అంబులెన్స్‌లో పొల్లాచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాల్పారై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



గోతిలో పడి తలకిందులైన రవాణా సంస్థ బస్సు

శివలింగ ప్రదక్షిణ చేసిన సర్పం



శివలింగం వద్ద సర్పం

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): నాగు పాము శివలింగ ప్రదక్షిణ చేయడం చూసిన భక్తులు పరవశించిపోయారు. తిరుపత్తూర్ జిల్లా ఆంబూరు సమీపం కీల్‌మురుగై ప్రాంతంలో సుయంబు బ్రహ్మపురీశ్వరాలయం ఉంది. శుక్రవారం సాయంత్రం ఆలయానికి వచ్చిన భక్తులు, గర్భగుడిలోని శివలింగం ముందు నాగు పాము ఉండడం గమనించి ఆశ్చర్యపోయారు. గంట సేపు అక్కడే సంచరించిన పాము గర్భగుడి నుంచి బయటకు వచ్చి సమీపంలోని పొలాల్లోకి వెళ్లింది. కాగా 2023లో ఆలయ గర్భగుడి ముందు ఉన్న నంది విగ్రహంపై కూడా నాగు పాము పడగ విప్పిన ఘటన జరిగింది. ప్రస్తుతం అదే ఆలయంలో శివలింగం వద్ద నాగు పాము రావడంతో భక్తులు ఆశ్చెరువొందారు.

పంచలోహ విగ్రహం స్వాధీనం

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): కారులో అక్రమంగా తరలిస్తున్న పంచలోహ అమ్మవారి విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, నలుగురిని అరెస్ట్ చేశారు. తూత్తుకుడి జిల్లా విగ్రహాల అక్రమ తరలింపు నిరోధక విభాగం పోలీసులకు అందిన సమాచారంతో వడవల్లనాడు సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో చాలాసేపటి నుంచి అక్కడ ఆగి ఉన్న కారులో తనిఖీలు చేపట్టారు ఓ గోతాములో రెండడుగుల అమ్మవారి పంచలోహ విగ్రహం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కారులో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ప్రాచీనమైన ఆ విగ్రహం ఏ ఆలయం నుంచి చోరీకి గురైంది? విగ్రహాన్ని కారులో ఎక్కడికి తరలిస్తున్నారు? అన్న కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.



ఎలక్ట్రికల్ బస్సుల్లో అదనపు ఛార్జీలు లేవు

● రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): త్వరలో నగరంలో నడపనున్న ఎలక్ట్రికల్ బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలుచేయమని, అలాగే, డీజిల్ బస్సులు తగ్గించమని రవాణా, విద్యుత్ శాఖ మంత్రి పి.శివశంకర్ తెలిపారు. వ్యాసర్పాడిలో నిర్మాణంలో ఉన్న ఎలక్ట్రికల్ బస్సుల డిపోను శనివారం మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... వ్యాసర్పాడి డిపో నుంచి తొలివిడతగా 120 ఎలక్ట్రికల్ బస్సులు నడపనున్నామన్నారు. అందుకోసం బస్సులకు ఛార్జింగ్ చేసే వసుతులు కల్పిస్తున్నామన్నారు. ఈ బస్సులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తర చెన్నై ప్రాంతంలో వాతావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. చెన్నై కార్పొరేషన్‌లో మొత్తం ఐదు ఎలక్ట్రికల్ బస్ డిపోలు ఏర్పాటు చేయనున్నామని, తొలివిడతగా వ్యాసర్పాడి డిపో పనులు ఈ నెలాఖరుకు పూర్తిచేయనున్నామన్నారు. అనంతరం పెరుంబాక్కం, సెంట్రల్, పూందమల్లి, తండయార్‌పేట తదితర ప్రాంతాల్లోని ఎలక్ట్రికల్ బస్సులు ఉంచేందుకు మౌలిక సదుపాయాల కల్పన చేపట్టనున్నామని తెలిపారు. తొలివిడతగా 650 బస్సులు, అనంతరం 500 బస్సులు నడపనున్నామన్నారు. ఏసీ బస్సులు, సాధారణ బస్సులు కూడా ఉంటాయన్నారు. డీజిల్ బస్సులు, ఎలక్ట్రికల్ బస్సులను ఒకే డిపోలో ఉంచడం లేదని, ఎలక్ట్రికల్ బస్సుల డిపోలో ఉన్న డీజిల్ బస్సులను ఇతర డిపోలకు తరలించనున్నామని తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభం తేది ముఖ్యమంత్రిని సంప్రదించిన అనంతరం ప్రకటిస్తామని మంత్రి తెలిపారు.



సమావేశంలో మంత్రి పి.శివశంకర్

సీబీఐ అధికారి పేరుతో మోసం

● వైద్యుడి నుంచి రూ.1.19 కోట్లు స్వాహా

అడయార్, మే 18 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారి పేరుతో బెదిరించి ఓ వైద్యుడు నుంచి రూ.1.19 కోట్లు మోసం చేసిన ఘటన తాజాగా వెలుగుచూసింది. ఈ కేసు వివరాలను పరిశీలిస్తే, తిరువారూర్ జిల్లా ముత్తుపేట కాళియమ్మాళ్ వీధికి చెందిన మీరా హుస్సేన్ స్థానికంగా మంచి వైద్యుడిగా గుర్తింపు పొందారు. ఈ నెల 5వ తేదీ వాట్సాప్ కాల్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి హుస్సేన్‌కు ఫోన్ చేసి.. తనను తాను సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత పాన్‌కార్డు, ఆధార్ కార్డు పరిశీలించగా, చట్ట వ్యతిరేకంగా నగదు లావాదేవీలు జరిగినట్టుగా గుర్తించాం. అందువల్ల డిజిటల్ అరెస్ట్ చేస్తున్నట్టు బెదిరించాం. ఈ డిజిటల్ అరెస్టు నుంచి విముక్తి పొందాలంటే తాను చెప్పిన బ్యాంకు ఖాతాకు డబ్బులు బదిలీ చేయాలని బెదిరించాడు. ఆ ప్రకారంగా జేకే ఎంటర్‌ప్రైజెస్ అనే పేరుతో తిరుచ్చిలోని ఒక ప్రైవేటు బ్యాంకు ఖాతాలో రూ.55 లక్షలు, కిరణ్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ అనే కంపెనీ బ్యాంకు ఖాతాకు రూ.64.20 లక్షలతో కలిపి రూ.1.19 కోట్ల మేరకు బదిలీ చేయించుకున్నాడు. ఆ తర్వాత వాట్సాప్ కాల్ కట్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్టు గ్రహించిన హుస్సేన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఇద్దరు కానిస్టేబుళ్లపై బదిలీ వేటు

అడయార్, మే 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్‌ను కలిసిన ఇద్దరు కానిస్టేబుళ్లను పోలీస్ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. తిరుపూరు వచ్చిన నయినార్‌ను తిరుపూర్ దక్షిణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసే చిన్నస్వామి, మరో హెడ్ కానిస్టేబుల్ మందిరం ఆది ఉన్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో పోలీస్ కమిషనర్ రాజేంద్రన్... ఆ ఇదరిని బదిలీ చేసి, శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.

గేట్ పడి ఇద్దరి మృతి

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి సమీపం కినత్తుకడవు వద్దనున్న ఓ సంస్థ ఇనుపగేట్ పడి ఇద్దరు మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి సంస్థ మేనేజర్ ఎబినేజర్ కృపాకరన్, ప్రొడక్షన్ విభాగం సూపర్‌వైజర్ శివపెరుమాళ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో రూ.38 లక్షల స్వాధీనం

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో తగిన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.38 లక్షలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్ర రాష్ట్రం కాకినాడ నుంచి చెంగల్పట్టు వెళ్లే సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. ఈ రైలులో వచ్చిన ప్రయాణికులను రైల్వే పోలీసులు తనిఖీ చేస్తున్న సమయంలో, ఓ యువకుడు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని అతడి బ్యాగు పరిశీలించగా రూ.38 లక్షల నగదు బయటపడ్డాయి. విచారణలో... అతను ఆంధ్ర రాష్ట్రం బాపట్ల జిల్లాకు చెందిన నరేష్ అని, మరొకరి ఇచ్చేందుకు నగదు తీసుకొస్తున్నట్లు తెలిసింది. ఆ నగదుకు తగిన పత్రాలు లేకపోవడంతో నగదుతో పాటు యువకుడిని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు రైల్వే పోలీసులు అప్పగించారు.

‘ఆపరేషన్ సిందూర్’ టీ-షర్టులకు గిరాకీ

● తిరుప్పూర్‌కు భారీగా ఆర్డర్లు

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్‌లోని బనియన్ తయారీ సంస్థలు, టీ-షర్ట్‌లు తయారుచేస్తుంటాయి. తిరుప్పూర్ సంస్థలు తయారుచేసే రెడీమేడ్ దుస్తులు అన్ని రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. అలాగే, వేడుకలు, క్రీడలు, ఎన్నికల ప్రచారాలు సహా పలు కార్యక్రమాలకు అవసరమయేయ టీ-షర్ట్‌లు ఆర్డరు పేరుతో లోగో, డిజైన్‌లు ముద్రించి తయారుచేస్తుంటారు. సాధారణ డిజైన్‌లతో పాటు కొత్త కొత్త డిజైన్‌లలో టీ-షర్ట్‌లు తయారుచేయడం తిరుప్పూర్ వ్యాపారుల ప్రత్యేకత. ఈ నేపథ్యంలో, తిరుప్పూర్‌లో ప్రస్తుతం ‘ఆపరేషన్ సిందూర్’ టీ-షర్ట్‌లు తయారవుతుండగా, పలు రాష్ట్రాల నుంచి భారీగా ఆర్డర్లు వస్తుండడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



మెదడు నిర్జీవమైన యువకుడి అవయవ దానం



మహాదేశ్వరన్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిలా సెంగం ప్రాంతానికి చెందిన మహాదేశ్వరన్ (40)కు గత శుక్రవారం జరిగిన ఓ ప్రమాదంలో తలకు బలమైన గాయమై మెదడు నిర్జీవమైన స్థితి ఏర్పడింది. ఆ నేపథ్యంలో, అతడి కుటుంబ సభ్యుల అనుమతితో అతని శరీరంలోని కళ్లు, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కాలేయం తదితర భాగాలను చెన్నై అపోలో ఆస్పత్రి వైద్య సిబ్బంది సేకరించి, వాటిని అవసరమైన వారికి పంపే ఏర్పాట్లు చేపట్టారు. అవయవదానం చేసిన మహాదేశ్వరన్ మృతదేహం వద్ద వైద్యులు నివాళులర్పించారు.

ఒకే రోజు నలుగురు యువతుల అదృశ్యం

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లాలో వేర్వేరు గ్రామాలకు చెందిన నలుగురు యువతులు ఒకే రోజు అదృశ్యం కావడం కలకలం రేపింది. వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురు ఆదివారం ఉదయం నుంచి కనిపించడం లేదని వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు, ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి గాలిస్తున్నారు.

హైవే అభివృద్ధి పనులపై కలెక్టర్ పరిశీలన



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు-బెంగుళూరు జాతీయ రహదారిపై మరమ్మతులకు గురైన ప్రాంతాల్లో చేపట్టిన పనులను శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ హైవేపై లైట్లు, రోడ్డు మరమ్మతులు, డివైడర్ల ఏర్పాటు తదితర పనులను చేపట్టామని, త్వరలోనే ఈ పనులు పూర్తవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పృథ్విరాజ్, ఇంజనీర్ జయకుమార్, రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పరిసరాలను శుభ్రం చేయండి

● అధికారులకు గ్రామస్తుల వినతి



వేలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా అనైకట్టు పరిధిలోవున్న సమత్తువపురం పంచాయతీ నుంచి గోవర్ధనపురం వెళ్లే కాలువ చుట్టు గత కొన్ని నెలలుగా శుభ్రం చేయకపోవడంతో చెట్లు పెరిగి అక్కడి పంపుసెట్ మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కార్యక్రమానికి మండల రెవెన్యూ అధికారులు రాగా నీటి కాలువ సమీపంలో తొట్టె, తదితర ప్రాంతాలు దుర్వాసన వ్యాపిస్తున్నాయని, వీటిని శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని కోరారు.

రాష్ట్రంలో 18 మందికి కరోనా

చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 18 మందికి కరోనా వైరస్ సోకినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. ప్రస్తుతం సింగపూర్, థాయ్‌లాండ్‌లో కరోనా మహమ్మారి తీవ్రంగా వ్యాపిస్తోంది. ప్రస్తుతం భారతదేశంలోనూ గతంలాగా శక్తివంతం కాని కరోనా వైరస్ వ్యాపిస్తున్నట్లు అధికారులు కనుగొన్నారు. తాజాగా పుదుచ్చేరిలో 13 మంది, కేరళలో 15 మంది, కర్ణాటకలో నలుగురు, మహారాష్ట్రలో ఏడుగురు, ఢిల్లీలో ఒకరు ఈ కొత్త వైరస్‌బారినపడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ 18 మంది ఈ వైరస్‌బారినపడి వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.

రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు

● ప్రారంభించిన మంత్రి శేఖర్‌బాబు

అడయార్, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని పట్టీశ్వరాలయంలో రూ.13 కోట్లతో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులను రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు ప్రారంభించారు. ఈ ఆలయంలో అన్నదాన సత్రం, గోశాల సహా అనేక అభివృద్ధి పనులను రూ.13 కోట్లతో పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కోవై జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎన్.కార్తీక్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రమేష్, అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి, స్థానిక ప్రతినిధులు తదితరులు ఉన్నారు. అలాగే, కోయంబత్తూరు జిల్లా తొండాముత్తూరు మారియమ్మాళ్, పెరియ వినాయగర్ ఆలయ కుంభాభిషేకం వేడుకల్లో మంత్రి శేఖర్ బాబు పాల్గొన్నారు. అనంతరం పోరూర్ పట్టీశ్వరాలయంలో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

● కుమార్తెకు గాయాలు



తండ్రి మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న కుమార్తె

తిరుత్తణి, మే 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కుమార్తె కళ్ల ముందే ఓ వ్యక్తి ట్రక్ కింద పడి మృతిచెందిన సంఘటన తిరుత్తణిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే రాణిపేట జిల్లా లాలాపేటకు చెందిన ఆరుముగం (65) తిరుత్తణిలో ఉన్న తన అల్లుడి ఇంట్లో తన కుమార్తె సుమతిని దింపేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు తిరుత్తణి హైరోడ్డు చేరుకున్న సమయంలో అటువైపు మద్యం మత్తులో బైక్ నడుపుతున్న ఓ వ్యక్తి ఆరుమముగం నడుపుతున్న వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో బైక్ అదుపుతప్పి పక్కనే వేగంగా వెళ్తున్న లారీ చక్రం కింద పడి ఆరుముగం అక్కడికక్కడే మృతి చెందాడు. అది చూసిన అతని కుమార్తె సుమతి మృతదేహం వద్ద బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరుముగం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మదురై వచ్చి వెళ్ళాలంటే మనసురాదు

● ఐశ్వర్య లక్ష్మి

చిత్రజ్యోతి



ఐశ్వర్య లక్ష్మి

కోలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి వరుస చిత్రాలతో బిజీగా ఉంది. అదేసమయంలో తనకు సమయం చిక్కినపుడు, తన కొత్త చిత్రాల ప్రారంభానికి ముందు ఆమె ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో తాజాగా మదురై మీనాక్షి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'నాకు ఎంతో ఇష్టమైన ప్రదేశం మదురై. నేను నటించిన అన్ని చిత్రాల ప్రారంభోత్సవానికి ముందు ఇక్కడకు వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకోవడం ఆనవాయితీ. ఇపుడు కూడా అందుకే వచ్చారు. నేను నటించే ఒక కొత్త చిత్రం ప్రారంభంకానుంది. మీనాక్షి అమ్మవారంటే నాకు ఎంతో ఇష్టం. అయితే, అమ్మవారిని దర్శనం చేసుకున్న తర్వాత మదురై విడిచి వెళ్ళాలంటే మనసుకు ఎంతో కష్టంగా ఉంటుంది' అని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు.

సాయం చేయడం గొప్ప విషయం

● విజయ్ సేతుపతి
● యోగిబాబు మంచి వ్యక్తి

మన గురించి అన్ని తెలిసిన వ్యక్తి సాయం చేయడం వేరు.. మనం ఎవరో, మనమేంటో తెలియని సమయంలో తెలియని ఒక వ్యక్తి చేసే సాయం ఎంతో గొప్పది అని మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి అన్నారు. ఆయన తాజాగా నటించిన చిత్రం 'ఏస్'. 7సీఎస్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై తెరకెక్కింది. రుక్మిణి వసంత్ కథానాయిక. దర్శకుడు ఆరుముగ కుమార్ కథ సమకూర్చి దర్శకత్వం వహించడంతో పాటు సొంతంగా నిర్మించారు. మలేసియాలో భారీ బడ్జెట్‌తో కమర్షియల్ హంగులతో రూపొందించారు. ఈ నెల 23న విడుదలకానున్న నేపథ్యంలో చిత్ర ఆడియో రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. ఇందులో విజయ్ సేతుపతి మాట్లాడుతూ,



విజయ్ సేతుపతి, రుక్మిణి వసంత్

'యోగిబాబు ఈ చిత్రంలో మరో హీరో. ఆయన చాలా మంచి వ్యక్తి వ్యక్తి. ఇటీవలకాలంలో ఆయన గురించి నెగెటివ్ ప్రచారం సాగుతోంది. ప్రతిభావంతుడైన యోగిబాబు దర్శకుడు స్థాయికి చేరుకోవాలి. హీరోయిన్ రుక్మిణి మంచి నటి. బబ్లూ పృథ్విరాజ్ మంచి పాత్రలో నటించారు. నేను అవకాశాల కోసం గాలిస్తున్న సమయంలో నాపై నమ్మకం ఉంచి నాకు సిఫార్సు చేసిన వ్యక్తి ఆరుముగం. ఆయనకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు ఆరుముగ కుమార్ మాట్లాడుతూ, 'విజయ సేతుపతి నాకోసం ఎంతలా సాయం చేశారో, ఎంతగా శ్రద్ధగా చూసుకున్నాడో మాటల్లో చెప్పలేను. యోగిబాబు ఓ ముఖ్య పాత్రలో నటించారు. ఈ మూవీ ప్రతి ఒక్కరికీ నచ్చే కమర్షియల్ మూవీగా నిలుస్తుంది' అన్నారు.

యోగిబాబు హీరోగా రూక్స్ మీడియా చిత్రం

గతంలో అర్జున్ దాస్ - కాళిదాస్ హీరోలుగా 'పోర్' వంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిన రూక్స్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ ఇపుడు ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించింది. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ చిత్రం షూటింగ్ కూడా పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి జై దర్శకత్వం వహించారు. 'ప్రొడక్షన్ నెం-2' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న మూవీలో యోగిబాబు, మేఘా థామస్, జాసిక్, అంజు తదితరులు నటించారు. కుత్రాలం, దాని పరిసర ప్రాంతాల్లో షూటింగ్



చిత్ర బృందంతో యోగిబాబు

జరుపుకుంది. నేటి యువతరానికి తగిన కుటుంబ నేపథ్యంలో వినోదాత్మక చిత్రంగా నిర్మాతలు ప్రభు ఆంటోనీ, మధు అలెగ్జాండర్ సంయుక్తగా నిర్మించారు. ప్రస్తుతం చిత్రీకరణ పనులు పూర్తి చేసుకుని తుదిదశ నిర్మాణ పనులను జరుపుకుంటుంది. నరేష్ కుమార్ సినిమాటోగ్రఫీ సమకూర్చిన ఈ చిత్రానికి బిజు సామ్ సంగీతం అందించారు. సోమవారం ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయనున్నారు.

భారత - పాక్ యుద్ధం అనవసరం
హీరో విశాల్

భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య జరిగిన యుద్ధం అనవసరమైనదని, దీన్ని నివారించివుండొచ్చని హీరో విశాల్ అభిప్రాయ పడ్డారు. విశాల్ ప్రజా సంక్షేమ సంఘం చెంగల్పట్టు జిల్లా కార్యదర్శి సతీష్ కుమార్ వివాహం మదురై తిరుమంగళంలో ఆదివారం జరిగింది. ఈ వేడుకకు హాజరైన విశాల్.. నూతన వధూవరులను ఆశీర్వదించి మాట్లాడుతూ, 'మదురైకు ఒక వివాహం కోసం వచ్చాను. ఇక్కడకు వచ్చిన తర్వాత మదురై మీనాక్షి అమ్మవారిని దర్శనం చేసుకోకుండా ఎలా వెళ్ళగలం? మీనాక్షి అమ్మను దర్శనం చేసుకోకుండా వెళితే మా అమ్మ ఇంట్లోకి రానివ్వరు. అమ్మ ఇచ్చిన చీరను మీనాక్షి అమ్మవారికి బహూకరించి, దర్శనం చేసుకున్నాను. నేను మదురైకి 2006లో 'తిమిరు' చిత్రం షూటింగు కోసం వచ్చాను. దాదాపు 19 యేళ్ళ తర్వాత మళ్ళీ మదురై వచ్చాను. నడిగర్ సంఘం భవన నిర్మాణ పనుల్లో జాప్యానికి నేను కారణం కాదు. ఆరు నెలల్లో పూర్తి చేయాల్సిన ఈ పనులు.. నడిగర్ సంఘం ఎన్నికలు, ఓట్ల లెక్కింపు తదితర కారణాలతో హైకోర్టును ఆశ్రయించడంతో మూడేళ్ళు జాప్యం జరిగింది. మరో నాలుగు నెలల్లో భవన నిర్మాణం చాలా మేరకు పూర్తవుతుంది. భారత్, పాకిస్థాన్ యుద్ధం అనవసరమైనది. దీన్ని నివారించి ఉండొచ్చు. దేశ రక్షణలో సైనికులు ప్రాణాలు కోల్పోవడం మనసుకు ఎంతో కష్టంగా ఉంది. ప్రతి దేశానికి సరిహద్దులున్నాయి. దాన్ని అర్థం చేసుకుని, నడుచుకుంటూ యుద్ధం అనే మాటకే తావులేదు' అని అన్నారు.



ప్రశాంతంగా



టీడీపీ సీనియర్ నాయకులు రామారావు, రామాంజనేయులు - ఆర్ఎంకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఆర్ఎస్ మునిరత్నం, డైరెక్టర్ కిషోర్ - నటి సత్యప్రియ - గాయకుడు ఎస్పీ చరణ్ - నటి ప్రభ



సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు - సీటీఏ అధ్యక్షులు గోపాలకృష్ణా రెడ్డి - నటుడు భానుచందర్ - టీడీపీ నేత మన్నూరు చలపతి - ఏపీ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



అపోలో ఆస్పత్రుల చైర్మెన్ డాక్టర్ సి.ప్రతాప్‌రెడ్డి - సినీ నటుడు దగ్గుబాటి రాజా - సినీ నిర్మాత జీకే రెడ్డి



బ్యాలెట్ బాక్సులు



నటుడు అశోక్ - తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు - సంగీత దర్శకులు సాలూరు వాసురావు - కోటి



ఆస్కా సభ్యులు ముత్తినేని కృష్ణ - రవీంద్రనాథ్, ఎరుకలయ్య, అంజంతా శంకర్‌రావు

ముగిసిన ఆస్కా ఎన్నికలు



జెట్ అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి - బీజేపీ నాయకుడు చక్రవర్తి



వీల్‌చైర్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న సభ్యుడు



ఎలక్షన్ అధికారులు

ప్యారీస్, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ విజయరాఘవ రోడ్డులోవున్న 'ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్' (ఆస్కా)కు 2025-2027వ సంవత్సరానికి నూతన నిర్వాహక కమిటీ పదవులకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఆఫీస్ బేరర్లుగా 6 మంది, కమిటీ సభ్యులుగా 9 మంది, ట్రస్టీలుగా 9 మంది మొత్తం 24 మంది ఎన్నికల బరిలో నిలిచారు. 2,006 మంది సభ్యులున్న ఈ ప్రతిష్ఠాత్మక క్లబ్ ఎన్నికల్లో 'మెంబర్స్ వాయిస్', 'ట్రెండ్ సెట్టర్స్' ప్యానళ్లతో పాటు వివిధ పదవులకు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీచేయగా, ఎన్నికల కమిటీ చైర్మెన్ టీవీ కృష్ణకుమార్, సభ్యులు ఎ.వెంకటరెడ్డి, ఎంఆర్ రవికుమార్ రెడ్డి పర్యవేక్షణలో మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమై రాత్రి 8.30 గంటల వరకు ఈ ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. మెంబర్స్ వాయిస్ ప్యానల్ తరుపున అధ్యక్ష పదవికి జి.శశిధర్ రెడ్డి, ట్రెండ్ సెట్టర్స్ ప్యానల్ తరుపున అధ్యక్ష పదవికి ఎం.ప్రతాప్‌రెడ్డి వారి టీమ్ సభ్యులు పోటీపడ్డారు. 8ఏళ్ల అనంతరం జరిగిన ఈ ఎన్నికల్లో పారిశ్రామిక, సినీ, విద్య, న్యాయ, వైద్య, ఇంజనీరింగ్ తదితర రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు, దేశంలోని వివిధ ప్రాంతాల్లోవున్న ఆస్కా సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆస్కా ప్రాంగణంలోని గోదావరి హాలులో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 20 పోలింగ్ బూత్‌లు, బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేశారు. వెంకటగిరి టీడీపీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఏపీ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ప్రముఖ సినీ నటులు ఎం.భానుచందర్, అశోక్, దగ్గుబాటి రాజా, నటీమణులు ప్రభ, సత్యప్రియ ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు, సంగీత దర్శకులు కోటి, సాలూరి వాసురావు, సినీ నేపథ్య గాయకులు ఎస్పీ చరణ్, ప్రముఖ సినీ నటుడు విశాల్ తండ్రి జీకే రెడ్డి, అపోలో ఆస్పత్రుల చైర్మెన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి, లలితా జ్యువెలరీ సంస్థల అధినేత కిరణ్ కుమార్, ఆర్ఎంకే ఇంజనీరింగ్ కాలేజీ చైర్మెన్ ఆర్ఎస్ మునిరత్నం, డైరెక్టర్ ఆర్ఎం. కిషోర్, కార్యదర్శి యలమంచి ప్రదీప్, ఆస్కా అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారెడ్డి, కెన్సెస్ అధినేత, ఆస్కా మాజీ అధ్యక్షులు నరసారెడ్డి, ఆస్కా మరో మాజీ అధ్యక్షులు మాదాల ఆదిశేషయ్య సహా సుమారు 900 మందికి పైగా సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాత్రి 9.30 గంటలకు కౌంటింగ్ ప్రారంభమైంది. కాగా, ఎన్నికల నిర్వాహణకు, బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 70 మంది పాల్గొన్నారు. సోమవారం తెల్లవారుజామున విజేతలను ప్రకటించే అవకాశమున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

ముగిసిన వరల్డ్ హైపర్ టెన్షన్ లీగ్ పోటీలు



లీగ్ పోటీల నిర్వాహకులు

అడయార్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వరల్డ్ హైపర్ టెన్షన్ లీగ్‌ను రాజా అన్నామలైపురం, ఎంఆర్‌సీ నగర్‌లో ఉన్న చెట్టినాథ్ విద్యాశ్రమంలో జరిగింది. తొలి దశ లీగ్ పోటీ ఈ నెల 14న నిర్వహించగా, రెండో దశ లీగ్ పోటీ ఆదివారం నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న బీపీ రోగుల్లో అవగాహన కల్పించడం, అధిక రక్తపోటు వల్ల కలిగే అనారోగ్య సమస్యలను ప్రజలకు తెలియజేయడం, వాటి నివారణ తదితర అంశాలపై సమగ్ర సమాచారం అందించడం ఈ లీగ్ పోటీ ముఖ్యోద్దేశమని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు స్టేట్ ఆఫ్ ఇండియన్ సొసైటీ ఆఫ్ హైపర్ టెన్షన్ ప్రెసిడెంట్ డాక్టర్ సీహెచ్ వసంత్ కుమార్, చైర్మన్ డాక్టర్ కె.కన్నన్, కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పళని ఆలయంలో గౌతమి పూజలు

పెరంబూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి జన్మదినం సందర్భంగా పళని మురుగన్ ఆలయంలో పార్టీ ప్రచార కార్యదర్శి గౌతమి స్వర్ణ రథం లాగి పూజలు చేశారు. రోప్ కార్ మీదుగా కొండ ఆలయానికి వెళ్లిన గౌతమి పూజల అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టాస్మాక్‌లో ప్రస్తుతం జరుగుతున్న తనిఖీల్లో కొన్ని నిజాలు మాత్రమే వెలుగుచూస్తున్నాయని, అవినీతికి సంబంధించి మరిన్ని బయటకు వస్తాయన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి బలపడుతోందని గౌతమి తెలిపారు.



స్వర్ణ రథం లాగుతున్న గౌతమి

ఏర్కాడులో ఆహ్లాదకరం... పర్యాటకుల కోలాహలం



బోట్‌సవారీ చేస్తున్న పర్యాటకులు



చెన్నై, మే 18 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరుగడించిన ఏర్కాడులో సమ్మర్ ఫెస్టివల్, ఫ్లవర్ షో నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 23న ఈ వేడుకలు నిర్వహించడానికి ఉద్యానవన శాఖ అధికారులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రస్తుతం వారాంతపు సెలవులు కావటంతో గత రెండు రోజులుగా ఏర్కాడు వస్తున్న పర్యాటకుల సంఖ్య అధికమైంది. శనివారం రాత్రి ఓ మోస్తరుగా వర్షం కురవటంతో ఏర్కాడు అంతటా చల్లటి వాతావరం నెలకొంది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి కూడా ఆదివారం ఉదయం అత్యధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. అన్నా పార్కు, లేక్‌పార్క్, రోస్‌గార్డెన్, ఐందినై పూంగా, పకోడా పాయింట్, లేడీస్‌సీట్ తదితర ప్రాంతాలలో పర్యాటకులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. ఇదే విధంగా బోట్‌హౌస్ వద్ద కూడా పడవలలో సవారీ చేయడానికి పర్యాటకులు బారులు తీరారు. ఆదివారం వేకువజామునే వ్యాన్‌లు, కార్లలో వచ్చిన పర్యాటకులు సంఖ్య అధికం కావటంతో వాహనాలను పార్కింగ్ చేసేందుకు స్థలం చాలక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఘనంగా సప్త కన్నియమ్మన్
ఆలయ కుంభాభిషేకం



ఆలయ కలశాలకు కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుత్తణి, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని మురుగన్ ఆలయానికి అనుబంధమైన సప్త కన్నియమ్మన్ ఆలయ కుంభాభిషేకం ఆదివారం ఘనంగా జరిగింది. వైకాశి ఉత్సవాల్లో భాగంగా ఆలయం నిర్వాహకులు 11 యాగశాలల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు, భక్తుల దివ్యనామస్మరణల మధ్య పుణ్యజలాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి, గోపుర కలశాలపై అభిషేకించారు. అనంతరం అర్చకులు గర్భాలయంలోని సప్త కన్నియమ్మన్‌ను పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ జాయింట్ కమిషనర్ కె.రమణి, ధర్మకర్తల మండలి చైర్మెన్ శ్రీధరన్, ఆలయ నిర్వాహకులు పాల్గొని, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



మురుగన్ ఆలయంలో ఘనంగా వైకాశి పూజలు

తిరుత్తణి, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ క్షేత్రంలో వైకాశి ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యస్వామివారికి పుణ్యజలాలతో అభిషేకించారు. ఉదయం 5 గంటల నుండే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు సుమారు గంటపైగా క్యూలైన్లలో వేచివున్నారు. అనంతరం అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరరించి భక్తులకు దర్శనం కల్పించారు.



మురుగన్‌కు పూజలు చేస్తున్న అర్చకులు

నోరూరిస్తున్న చెట్టినాడ్ ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో అంజప్పర్ రెస్టారెంట్ అధినేతలు, చెఫ్‌లు

ప్యారీస్, మే 18 (ఆంధ్రజ్యోతి): విభిన్న వంటకాలకు నెలవైన చెన్నై మహానగరంలో అంజప్పర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన చెట్టినాడ్ ఫుడ్ ఫెస్టివల్ ఆహార ప్రియులను నోరూరిస్తోంది. గత 1964లో రాయపేటలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ చేతుల మీదుగా ప్రారంభించిన అంజప్పర్ హోటల్ 60ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా తమ కస్టమర్లకు శాఖాహారం, మాంసాహార రుచులు అందజేసేలా శనివారం ప్రారంభించిన ఫుడ్ ఫెస్టివల్ ఈ నెల 25వ తేదీ వరకు 10 రోజులపాటు నగరంలోని 23 అంజప్పర్ బ్రాంచీల్లో కొనసాగనుంది. పోరూర్ అంజప్పర్ హోటల్‌లో జరిగిన ప్రారంభోత్సవంలో యజమానులు కందసామి, ఇందిరా కందసామి, మరుద పాండియన్, సంగీత, అను, చెఫ్‌లు మాల్గుడి సువిత, పళని, బిజినెస్ హెడ్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్య అభివృద్ధికి సోపానం : నటుడు కార్తీ



సావనీర్ ఆవిష్కరణలో నటుడు కార్తీ, ఛాన్సలర్ విశ్వనాథన్ తదితరులు

వేలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్య అభివృద్ధికి సోపానమని నటుడు కార్తీ విద్యార్థులకు సూచించారు. కాట్పాడిలోని సాంకేతిక విద్య కళాశాల 'స్టార్' పథక 8వ విడత విద్యార్థుల సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమానికి వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, వర్సిటీ ఉపాధ్యక్షులు శంకర్, శేఖర్, కాదంబరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నటుడు కార్తీ మాట్లాడుతూ... మన నుంచి నగదు, వస్తువులు దూరమైనా, దూరం చేయలేనిది విద్య మాత్రమే అన్నారు. వ్యవసాయం తన పిల్లలకు వద్దని పలువురు రైతులు భావిస్తున్నారని, అలాంటి ఆలోచన వలన భవిష్యత్తులో ఆహారం లభించని ప్రమాదం ఉందన్నారు. యువత వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని కార్తీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక సావనీర్‌ను నటుడు కార్తీ, ఛాన్సలర్ విశ్వనాథన్ ఆవిష్కరించారు.